

5న కలగంపూడి రానున్న సిఎం జగన్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పి

ప్రజాశక్తి - యలమంచిలి

సిఎం జగన్ మార్చి ఐదో తేదీన ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు కుమార్తె వివాహానికి కలగంపూడి రానున్న నేపథ్యంలో హెలీప్యాడ్, ఇతర ఏర్పాట్లను కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పి యు.రవి ప్రకాష్ సోమవారం పరిశీలించారు. హెలీప్యాడ్, వివాహా వేదికను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. వారి వెంట ఇన్‌ఛార్జి జెసి ఎం.సూర్యతేజ, ఆర్అండ్‌బి అధికారి ఎస్.లోకేశ్వరరావు, జిల్లా, మండల అధికారులు ఉన్నారు.

ఇల్లు కట్టకుంటే పట్టా రద్దు..!

లబ్ధిదారులపై తీవ్రమైన ఒత్తిడి
ప్రభుత్వ సాయం కేవలం రూ.లక్షా 80 వేలే
ఇంటి నిర్మాణానికి అయ్యే ఖర్చు రూ.8 లక్షలుపైనే
అధికారుల ఒత్తిడితో ఆందోళనలో లబ్ధిదారులు
ప్రభుత్వ తీరుపై జనంలో తీవ్ర ఆగ్రహం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఇళ్ల స్థలాల లబ్ధిదారులపై అధికారులు తీవ్రమైన ఒత్తిడికి దిగారు. ఇల్లు కట్టకుంటే పట్టా రద్దు చేస్తామంటూ బెదిరింపులపర్వానికి దిగడంతోపాటు పలుచోట్ల నోటీసులు సైతం జారీ చేస్తున్నారు. దీంతో అప్పు చేసి ఇల్లు కట్టలేక, ఉన్న స్థలం పోతుందనే భయం లబ్ధిదారులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఆర్థిక స్తోమత గురించి ఆలోచించకుండా ఇల్లు కట్టాలంటూ ఒత్తిడి తేవడంపై లబ్ధిదారుల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 1800 లేఅవుట్‌లలో 2.50 లక్షల ఇళ్ల పట్టాలను ప్రభుత్వం మంజూరు చేసింది. తొలివిడతగా 1,109 లేఅవుట్లలో 1.42 లక్షల ఇళ్లు నిర్మించాలని అధికారులు ప్రణాళిక రూపొందించారు. జిల్లాల విభజన జరిగిన తర్వాత ఏలూరు జిల్లాలో తొలివిడతగా 1.03 లక్షల ఇళ్లు నిర్మించాలనే లక్ష్యంతో ఇక్కడి



అధికారులు ముందుకు సాగుతున్నారు. పశ్చిమగోదారి జిల్లాలోనూ తొలివిడతగా దాదాపు 72 వేల ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ప్రణాళికలు రూపొందించారు. ఏలూరు జిల్లాలో ఇప్పటి వరకూ 14 వేల ఇళ్ల నిర్మాణం పూర్తయినట్లు లెక్కలు చెబుతున్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలోనూ ఇళ్ల నిర్మాణం లక్ష్యం మేరకు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. వచ్చే ఉగాది నాటికి పెద్దఎత్తున గృహప్రవేశాలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఇళ్ల నిర్మాణంపై అధికారులు తీవ్రమైన ఒత్తిడి చేస్తున్నారు. ఇంటి నిర్మాణం చేయకుంటే పట్టా రద్దు చేస్తామంటూ బెదిరింపులపై లబ్ధిదారుల నుంచి తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది. దీనికి కారణం ఇల్లు నిర్మించుకునే పరిస్థితుల్లో లబ్ధిదారులు లేకపోవడమే. ఇంటి నిర్మాణానికి అయ్యే ఖర్చు భరించగలిగే స్థితి 90 శాతానికిపైగా లబ్ధిదారులకు లేదు. దీంతో ఇంటి నిర్మాణం పేరు చెబితే భయపడే పరిస్థితి నెలకొంది. నిర్మాణానికి అయ్యే ఖర్చుకు, ప్రభుత్వం ఇచ్చే సాయానికి పొంతన లేకుండాపోయింది. దీంతో ఏ విధంగా ఇల్లు నిర్మించాలని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు.

పునాదులకే చాలని ప్రభుత్వ సాయం


ఇంటి నిర్మాణం చేయాలంటే ప్రస్తుత పరిస్థితుల్లో తక్కువగా లెక్కించినా రూ.ఎనిమిది లక్షలుపైనే ఖర్చవుతోంది. అయితే ప్రభుత్వం ఇచ్చే రుణం సాయం కేవలం రూ.లక్షా 80 వేలు మాత్రమే. ప్రభుత్వం ఇచ్చే సొమ్ము పునాదుల దశకు కూడా చాలడం లేదు. ఇంకా దాదాపు రూ.ఆరు లక్షలు అప్పు చేస్తే తప్ప ఇల్లు పూర్తికాని పరిస్థితి ఉంది. ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు అంత పెద్దమొత్తంలో అప్పు పుట్టే పరిస్థితి లేదు. దీంతో ఇళ్ల నిర్మాణానికి పెద్దగా ముందుకు రావడం లేదు. ఇళ్ల నిర్మాణం ప్రారంభించి దాదాపు రెండేళ్లు పూర్తవుతున్నా ఇప్పటికీ నామమాత్రంగానే నిర్మాణాలు జరగడమే దీనికి నిదర్శనం. ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టాలంటే ఇనుము ఖర్చు రూ.లక్ష వరకూ అవుతోంది. తాపీ పని వారికి, కూలీలకు రూ.లక్షా 80 వేలు, దాదాపు 200 సిమెంట్ బస్తాలకు రూ.80 వేలు, ఇసుక 40 టన్నులకు రూ.65 వేలు, ఇటుకకు రూ.90 వేలు, మెటల్‌కు రూ.35 వేలు, సెంట్రింగ్‌కు రూ.22 వేలు, విద్యుత్, ప్లంబింగ్ పనులకు రూ.50 వేలు, టైల్స్, గుమ్మాలు, కిటికీలు వంటి ఖర్చులకు రూ.లక్షపైనే అవుతోంది. ఇంకా ఇతర ఖర్చులు ఉంటాయి. ఇంత పెద్దమొత్తంలో ఖర్చు చేసే స్తోమత లబ్ధిదారులకు లేకపోవడంతో ఇంటి నిర్మాణానికి జంకుతున్నారు. అధికారులు తీవ్రమైన ఒత్తిడి తెస్తుండటంతో లబ్ధిదారులకు ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. దీంతో నోటీసులిచ్చినా, పట్టాలు తీసుకున్నా ఇంటి నిర్మాణం చేయలేమని పలుచోట్ల లబ్ధిదారులు ఖరాఖండిగా చెబుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వం అందించే సాయం పెంచితే ఇంటి నిర్మాణాలపై లబ్ధిదారులు ముందుకొచ్చే పరిస్థితి ఉండొచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఎంఎల్‌సి పోరు షురూ

ముగిసిన నామినేషన్ల ప్రక్రియ
బెడిసికొట్టిన వైసిపి ఏకగ్రీవ యత్నాలు
ఇద్దరు వైసిపి, నలుగురు స్వతంత్ర అభ్యర్థులు
13న ఎన్నికలు
ఐదుచోట్ల పోలింగ్ కేంద్రాలు
ఓటు వేయనున్న 1,105 మంది

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల్లో వైసిపి వ్యూహం బెడిసికొట్టింది. ఏకగ్రీవంగా రెండు ఎంఎల్‌సి స్థానాలను చేజిక్కించుకునేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసింది. రెండు ఎంఎల్‌సి స్థానాలకు ఆరుగురు అభ్యర్థులు బరిలో నిలిచారు. వీరిలో వైసిపి అభ్యర్థులుగా వంకా రవీంద్ర, జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ నిలవగా, స్వతంత్ర అభ్యర్థులుగా వీరవాసరం మండలానికి చెందిన మాజీ ఎంపిపి వీరవల్లి చంద్రశేఖర్, కామవరపుకోట మండలానికి చెందిన గోరింక దాసు, పెదవేగి మండలానికి చెందిన దేవరపల్లి ఆదాం, పెంటపాడుకు చెందిన పసల వెంకటాచలం బరిలో నిలిచారు. దీంతో ఎంఎల్‌సి ఎన్నికలు అనివార్యమయ్యాయి. మార్చి 13న ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ జరగనుంది. ఎన్నికల్లో జెడ్‌పిటిసి, ఎంపిటిసి, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, ఎంఎల్‌ఎలు, ఎంపీలు ఓటు వేయనున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 1,105 మంది ఓటర్లు ఈ ఎన్నికల్లో తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. మొత్తం ఓట్లలో దాదాపు 881 మంది వైసిపి ప్రజాప్రతినిధులు ఉండగా, 224 మంది టిడిపి, జనసేన ప్రజాప్రతినిధులు ఉన్నారు.



కవురు శ్రీనివాస్ వంకా రవీంద్రనాథ్ వీరవల్లి చంద్రశేఖర్ దాస్ చలం ఆదాము

స్వతంత్ర అభ్యర్థులకు టిడిపి అండ

ఎంఎల్‌సి ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులుగా నిలిచినవారంతా టిడిపి నాయకులుగా ఉన్నవారే. వీరిలో వీరవల్లి చంద్రశేఖర్ భార్య ప్రస్తుతం వీరవాసరం ఎంపిపిగా ఉన్నారు. ఆయనకు నిమ్మల రామా నాయుడు అండ ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. దెందులూరు నియోజకవర్గానికి చెందిన గోరింక దాసుకు చింతమనేని అండ ఉన్నట్లు చెబుతున్నారు. ఎంఎల్‌సి ఎన్నికల్లో ఒక వ్యూహం ప్రకారం తమ నాయకులను స్వతంత్ర అభ్యర్థులుగా టిడిపి బరిలోకి దింపినట్లు తెలుస్తోంది. ఎంపిటిసిల ఛాంబర్ పరోక్షంగా వీరికి అండగా నిలవనున్నట్లు ప్రచారం సాగుతోంది. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల్లో అత్యధికంగా బిసిలు ఉన్నారు. దీంతో వైసిపి అభ్యర్థిగా బిసి సామాజిక తరగతికి చెందిన కవురు శ్రీనివాస్‌ను బరిలో దింపారు. అదే సామాజిక తరగతికి చెందిన వీరవల్లి చంద్రశేఖర్ పోటీలో ఉండటంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఎంఎల్‌సి ఎన్నికల్లో మొదటి, ద్వితీయ, తృతీయ ప్రాధాన్యత ఓటు ఆధారంగా ఎన్నికలు జరుగుతాయి. దీంతో మొదటి ప్రాధాన్యత ఓటు వైసిపి అభ్యర్థికి వేసి, రెండో ప్రాధాన్యత ఓటు స్వతంత్ర అభ్యర్థికి వేస్తే ఒక ఎంఎల్‌సి స్థానం గెలుచుకునే అవకాశం ఉందనే వ్యూహంతోనే టిడిపి తమ వారిని స్వతంత్ర అభ్యర్థులుగా పోటీలో నిలిపినట్లు తెలుస్తోంది. ఎంఎల్‌సి ఎన్నికలు అనివార్యం కావడంతో వైసిపి అభ్యర్థుల్లో కొంత గుబులు నెలకొంది.

ఐదు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు

ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఐదుచోట్ల పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఏలూరు ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 249 మంది ఓటు వేయనున్నారు. జంగారెడ్డిగూడెం ఎంపిడిఒ కార్యాలయ కేంద్రంలో 184 మంది, కొవ్వూరు ఎంపిడిఒ కార్యాలయ కేంద్రంలో 242, నరసాపురం ఎంపిడిఒ కార్యాలయ కేంద్రంలో 229 మంది, భీమవరం ఎంపిడిఒ కార్యాలయ పోలింగ్ కేంద్రంలో 201 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకునే విధంగా అధికారులు ఏర్పాటు చేశారు. ఈ నెల 13న జరగనున్న ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లనూ పూర్తి చేస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ పోలింగ్ జరగనుంది. 16వ తేదీన కౌంటింగ్ జరగనుంది.

నోట్; కిందిమేటర్‌ను బాక్స్‌లో పెట్టగలరు

చివరిరోజు ఒక నామినేషన్ విత్‌డ్రా

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికలలో ఆరుగురు అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. నామినేషన్ల ఉపసంహరణకు చివరి రోజైన సోమవారం స్వతంత్ర అభ్యర్థి వంకా రాజకుమారి తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం ఎనిమిది మంది అభ్యర్థులు 15 నామినేషన్లను దాఖలు చేయగా వారిలో స్వతంత్ర అభ్యర్థి నల్లి రాజేష్ నామినేషన్ నిబంధనల మేరకు లేకపోవడంతో తిరస్కరించారు. మరో స్వతంత్ర అభ్యర్థి వంకా రాజకుమారి నామినేషన్‌ను ఉపసంహరించుకోవడంతో ఆరుగురు అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు.

ఇళ్ల లబ్ధిదారుల సమస్యలు పరిష్కరించాలి

టిడ్కో ఇళ్లు వెంటనే అప్పగించాలి
జగనన్న ఇంటి నిర్మాణ సాయం రూ.6 లక్షలకు పెంచాలి
కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలి
కలెక్టరేట్ వద్ద ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం పట్టణంలో 82 ఎకరాల్లో నిర్మించిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు వెంటనే అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం డిమాండ్ చేశారు. జగనన్న లేఅవుట్‌లో లబ్ధిదారులకు ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి లబ్ధిదారులకు అందించాలని కోరారు. టిడ్కో ఇళ్ల, జగనన్న ఇళ్ల స్థలాల లబ్ధిదారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక కలెక్టరేట్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి ప్రభుత్వ అధికారులకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. తక్షణం టిడ్కో గృహాల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు అందించడంతోపాటు జగనన్న ఇళ్ల స్థలాల్లో ప్రభుత్వమే ఇల్లు నిర్మించి లబ్ధిదారులకు అందించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ టిడ్కో గృహాలను గత టిడిపి ప్రభుత్వ హయాంలోనే ఎక్కువ శాతం నిర్మాణం పూర్తి చేశారని గుర్తు చేశారు. ఎన్నికలొచ్చాయని పనులు పూర్తి కాకుండానే హడావిడిగా ఇళ్ల స్వాధీన పత్రాలు ఇచ్చి గృహప్రవేశాలు చేయించారని ఆరోపించారు. కనీస, మౌలిక సదుపాయాలు మాత్రం కల్పించలేదని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత పూర్తయిన ఇళ్లను కూడా లబ్ధిదారులకు అందించలేకపోయిందని మండిపడ్డారు. కరోనా సమయంలో ఈ ఇళ్లను ఐసోలేషన్ కేంద్రాలకు వినియోగించడం మాత్రం చేశారన్నారు. లబ్ధిదారులు వడ్డీలకు వేలకు వేలు అప్పు చేసి డిపాజిట్లు కట్టారని, అయితే పూర్తయిన ఇల్లు కూడా లబ్ధిదారులకు స్వాధీనం



తాడేపల్లిగూడెంలో

చేయకపోవడంతో డబ్బులకు వడ్డీలు కట్టలేక ఇంటి అద్దె చెల్లించలేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు నిత్యావసర వస్తువుల ధరలు పెరగడమే కాక పెట్రోల్, డీజిల్, గ్యాస్ వంటి ధరలు కూడా పెరిగి సామాన్య, మధ్యతరగతి అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలోనే జగనన్న ఇళ్ల నిర్మాణ భారంగా మారిందన్నారు. నిర్మాణానికి లక్షలాది రూపాయలు వడ్డీలకు తీసుకొచ్చి అప్పుల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే జగనన్న ఇంటి నిర్మాణనికి రూ.ఆరు లక్షలు మంజూరు చేయాలని, టిడ్కో ఇళ్లను త్వరగా పూర్తిచేసి మౌలిక వసతులు కల్పించి లబ్ధిదారులకు అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో దశలవారీ పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం డిఆర్ఒ కృష్ణవేణికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దూసి కళ్యాణి, నాయకులు ఎం.వైకుంఠరావు, వరలక్ష్మి, బొక్కా సత్యనారాయణ, డి.త్రిమూర్తులు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, అన్యం రాంబాబు, కాటం నాగరాజు, శ్రీను, కుమారి, రమేష్, ఏసు, వీరాస్వామి, గుడాల శ్రీను, లక్ష్మి, సత్యవతి పాల్గొన్నారు.

ఉండి: జగనన్న ఇళ్ల లబ్ధిదారులకు ఇల్లు నిర్మాణానికి రూ.ఆరు లక్షలు ఆర్థిక సాయం అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఇళ్ల స్థలాల లబ్ధిదారుల సమస్యలను పరిష్కరించాలని సిపిఎం ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకిరాగానే లక్షలాది మందికి ఇళ్ల స్థలాలను కేటాయించామని ఆర్భాటంగా చెబుతున్నారని, అయితే అదంతా కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని అన్నారు. వాస్తవంలోకి ఇళ్ల స్థలాల కేటాయింపులు సరిగ్గా లేవని ఆయన విమర్శించారు. మండలంలో 2,473 మందికి ఇళ్ల స్థలాల పట్టాలు అందజేయగా వారికి స్థలాలు చూపించడంలో రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. లబ్ధిదారులకు కేటాయించిన స్థలాల్లో ఇళ్లు




భీమవరంలో..

నిర్మించడానికి చాలాగ్రామాల్లో మట్టి పూడిక చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాందువ్వ, కలిగొట్ల, ఉప్పులూరు, పాములపర్రు, ఆరేడు, ఎన్ఆర్‌పి.అగ్రహారం వంటి గ్రామాల్లో ఇప్పటి వరకు ఇళ్ల స్థలాల పూడిక సక్రమంగా జరగలేదని, అటువంటి చోట ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు ముందుకు రాని పరిస్థితి నెలకొందని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి స్థలాల లబ్ధిదారులకు ఇంటి నిర్మాణానికి రూ.6 లక్షలు ఆర్థిక సాయం అందించాలని, జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని గోపాలన్ డిమాండ్ చేశారు. అనంతరం మండల డిప్యూటీ తహశీల్దార్ ఎస్.వీరాస్వామినాయుడుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్, నాయకులు కొట్టాడ వెంకటేశ్వరరావు, చిప్పాడ బుచ్చేశ్వరరావు, చీర్ల శేషు, వీరవల్లి మాధవరావు, కిలారి తవిటినాయుడు, మాదాసు గోపీ, నక్కా వెంకటేశ్వర్లు, కడలి నాగేశ్వరరావు, కొల్లి రత్నకుమారి, కలిదిండి సూర్యనారాయణరాజు, పెళ్లూరి సుబ్రహ్మణ్యం, చిట్టిబాబు పాల్గొన్నారు.

ఆచంట: కొండెక్కిన నిర్మాణ సామగ్రి ధరలతో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం మరింత భారంగా మారిందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ అన్నారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలంటూ సిపిఎం ఆధ్వర్యాన ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి తహశీల్దార్ రాజ్యలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ ఇంటి నిర్మాణానికి కనీసం రూ.ఆరు లక్షలు ప్రభుత్వం ఇవ్వాలని, లేనిపక్షంలో ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. జగనన్న కాలనీల్లో అన్ని వసతులూ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎస్‌విఎన్.శర్మ, సిర్రా నరసింహమూర్తి, వద్దిపర్తి అంజిబాబు, తోటపల్లి సత్యనారాయణ, కుసుమే జయరాజు, ఇందుకూరి సూర్యనారాయణరాజు, బొర్రా ధర్మారావు, సిర్రా విఘ్నేశ్వరుడు, బుల్లబ్బాయి, కొండేటి రాఘవులు, రాజు, శ్రీను పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: టిడ్కో ఇళ్లను ప్రభుత్వం వెంటనే లబ్ధిదారులకు అందించాలని, జగనన్న కాలనీల్లో ఇళ్లను ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలని, టిడ్కో ఇళ్ల సముదాయం వద్ద హెల్త్ సెంటర్, అంగన్‌వాడీ సెంటర్ ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు, నేతలు కరెడ్ల రామకృష్ణ, గొన్నాబత్తుల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. టిడ్కో ఇళ్లను బ్యాంకు అప్పుతో సంబంధం లేకుండా ఉచితంగా ఇస్తామని హామీ ఇచ్చి మూడేళ్లు దాటినా ఇప్పటికీ ఇళ్లు ఇవ్వడానికి ప్రభుత్వానికి మనసొప్పడం లేదన్నారు. తెచ్చిన అప్పులకు వడ్డీ చెల్లించలేక, మరోవైపు ఇంటి అద్దె చెల్లించలేక లబ్ధిదారులు నానావస్థలు పడుతున్నారన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం వెంటనే చేపట్టకపోతే పట్టా రద్దు చేస్తామని బెదిరించడం దారుణమన్నారు. ఇంటి నిర్మాణానికి కనీసం రూ.6 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చిటికిన రాము, జవ్వాది శ్రీను, శిద్దిరెడ్డి శేషుబాబు, గొర్రెల సతీష్, నరమాల కృష్ణ, మేట్రేటి రమణ, నర్మాల నారాయణరావు, కుంచంగి నానాజీ, ఏపూరి శ్రీను, కె.కొండలరావు, పోతు శ్రీను, అయినాల ధర్మారావు పాల్గొన్నారు.

యలమంచిలి: మండలంలోని నార్నిమెరక, మట్లపాలెం, పోలవరం తదితర గ్రామాల్లో జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి కానేటి బాలరాజు మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో రోడ్లు, కరెంటు, తాగునీటి సదుపాయం లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రభుత్వం ఇంటి నిర్మాణానికిచ్చే సొమ్మును రూ.6 లక్షలకు పెంచాలని కోరారు. ఇంటి నిర్మాణం ప్రారంభించకపోతే పట్టా రద్దు చేస్తామనడం దారుణమన్నారు. అనంతరం తహశీల్దార్ నరసింహారావుకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు బాతిరెడ్డి జార్జి, సరిపల్లి జయప్రభ, బాతిరెడ్డి సుగుణ, ఎడ్ల మోహనరావు, మాచవరపు సుబ్బారావు, గూడూరి నాగేశ్వరరావు, గూడూరి ఆంజనేయులు, గుబ్బల సత్యనారాయణ, కుమార్ పాల్గొన్నారు.



నరసాపురంలో

నరసాపురం: జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణానికి రూ.ఆరు లక్షలు ఇవ్వాలని, లేనిపక్షంలో ప్రభుత్వమే ఇల్లు ఉచితంగా నిర్మించి ఇవ్వాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు, పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ పట్టణంలో లబ్ధిదారుల కోసం మంగళగుంటపాలెంలో సేకరించిన 90 ఎకరాల భూమిని లబ్ధిదారులు ఇల్లు నిర్మించుకునేలా పూడిక చేయకపోవడం బాధాకరమన్నారు. వెంటనే ఆ స్థలాన్ని పూడిక చేసి రోడ్లు, డ్రెయినేజీ, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వం కనీసం రెండు సెంట్ల స్థలం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ ఎమ్‌డి.ఫాజిల్‌కు అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం నేతలు మంచిలి నీలకంఠం, పొన్నాడ రాము, బూడిద జోగేశ్వరరావు, పొగాకు నారాయణరావు, నోముల కొండచ జల్లి రామ్మోహన్‌రావు, ధనుంజయ్, తెలగంశెట్టి సత్యనారాయణ, శివరాజు, బద్రి, మల్లేష్ పాల్గొన్నారు.

కాళ్ల: జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి ఆ పార్టీ మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ మాట్లాడుతూ ఇల్లు నిర్మించకపోతే స్థలాలు తీసుకుంటామని నేతలు, అధికారులు బెదిరించడం సరికాదన్నారు. ఇంటి రుణం రూ.ఆరు లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండా సూరిబాబు, యేసురత్నం, కోటేశ్వరరావు, యెహోషువా పాల్గొన్నారు.

తణుకు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి జగనన్న ఇంటికీ రూ.6



తణుకులో

లక్షలు ఇవ్వాలని, టిడ్కో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి ఉచితంగా ఇవ్వాలని, సమస్యలు వెంటనే పరిష్కరించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి పివి.ప్రతాప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహశీలార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఇసుక, సిమెంట్, ఇటుక ధర తగ్గించాలని, ఇంటి స్థలం రెండు సెంట్లు ఇవ్వాలని, గోస్తనీ మళ్లింపు భూమి 7.26 సెంట్లలో జగనన్న ఇళ్లు ఇవ్వాలని నినదించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ పట్టణంలో జగనన్న ఇళ్లు 7867 ఇచ్చినా నేటికీ వెయ్యి కూడా కట్టలేదన్నారు. ప్రభుత్వం ఇచ్చే సొమ్ము పూడిక, బేస్‌మెంట్‌కూ చాలడం లేదన్నారు. టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు అప్పగించకపోవడం వల్ల అవి దెబ్బతింటున్నాయన్నారు. టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు ఉచితంగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అడ్డగర్ల అజయకుమారి, రంగారావు, గుబ్బల గోపి, నర్సింహరావు, టి.ధనలక్ష్మి, ఎన్.చిన్నారావు, సుధాకర్, ఎం.సువర్ణరాజు, టి.రామకృష్ణ, టి.వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, వీర్రాజు, ఎన్.రత్నం పాల్గొన్నారు.

పెనుమంట్ర: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఎం మండల కార్యదర్శి కూసంపూడి సుబ్బరాజు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించి తహశీల్దార్ దండు అశోక్‌వర్మకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నేతలు తెన్నేటి ఆంజనేయులు, వెంకట్రారాజు, ఆంజనేయులు పాల్గొన్నారు.

పాలకొల్లు: టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి జవ్వాది శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి వినతిపత్రం అందజేశారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ టిడ్కో ఇళ్ల సముదాయం వసతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్మూర్తి, అజయ్‌కుమార్, సోమేశ్వరరావు, టి.శ్రీనివాసరావు, సత్యనారాయణ, టి.గంగరాజు, గణేష్, పి.కృష్ణ, గురవయ్య, గుబ్బల త్రిమూర్తులు పాల్గొన్నారు.



విద్యార్థులను పరామర్శిస్తున్న సిపిఎం నేతలు

మధ్యాహ్న భోజనం తిన్న విద్యార్థులకు అస్వస్థత

వార్త మెయిన్‌లో..

సర్రాజుకి కుటుంబానికి అండగా ఉంటాం

ఎంపీ, వైసిపి గోదావరి జిల్లాల కోఆర్డినేటర్ మిథున్‌రెడ్డి

ప్రజాశక్తి - కాళ్ల, భీమవరం

విధేయత అనే మాటకు పాతపాటి సర్రాజు నిదర్శనంగా ఉంటారని రాజంపేట ఎంపీ, వైసిపి గోదావరి జిల్లాల కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అన్నారు. సోమవారం భీమవరంలో నిర్వహించిన క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్, ఉండి మాజీ ఎంఎల్‌ఎ పాతపాటి సర్రాజు సంస్మరణ సభ సోమవారం నిర్వహించారు.



మాట్లాడుతున్న మిథున్‌రెడ్డి, పక్కనే మంత్రులు, ప్రముఖులు

ముఖ్యఅతిథి మిథున్‌రెడ్డి మాట్లాడుతూ నిజజీవితంలో సర్రాజును చూసి ఎన్నో నేర్చుకోవచ్చన్నారు. పార్టీ బలోపేతానికి నిర్విరామ కృషి చేసిన మహానాయకుడు సర్రాజు అని కొనియాడారు. పార్టీలకు అతీతంగా సర్రాజును అందరూ అభిమానిస్తారన్నారు. సర్రాజు కుమారులు వెంకట శ్రీనివాసరాజు (వాసు), యుగంధర్ నాగవర్మ (వర్మ), కుటుంబ సభ్యులకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఇబ్బందులను నాడు వైఎస్ దృష్టికి, నేడు జగన్ దృష్టికి నేరుగా తీసుకెళ్లిన వ్యక్తి సర్రాజు అని అన్నారు. పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మాట్లాడుతూ పార్టీలో విభేదాలను పరిష్కరించడంలో సర్రాజు ఎప్పుడు ముందుండేవారన్నారు. తన రాజకీయ ఎదుగుదలకు పరోక్షంగా సర్రాజు దోహదపడ్డారన్నారు. మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ ఉండి నియోజకవర్గంలో ఏ సమస్యనైనా సర్రాజు దృష్టికి తీసుకెళ్తే పరిష్కారమవుతుందనే నమ్మకం జనాల్లో కల్పించిన నేత సర్రాజు అని కొనియాడారు. పలువురు సర్రాజు అభిమానులు మాట్లాడుతూ సర్రాజు తనయులకు పార్టీలో సముచిత స్థానం కల్పించాలని మిథున్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. మాజీ మంత్రులు ఇందుకూరి రామకృష్ణంరాజు, కంతేటి సత్యనారాయణరాజు మాట్లాడారు. కార్యక్రమంలో శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎంఎల్‌ఎలు గ్రంధి శ్రీనివాస్, మంతెన రామరాజు, పుప్పాల వాసుబాబు, చెరుకువాడ రంగనాథరాజు, మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు, మాజీ ఎంఎల్‌ఎలు పులపర్తి రామాంజనేయులు, బాబ్జి, పసల కనకసుందరం, మైనార్టీ సెల్ అధ్యక్షులు మేడిది జాన్సన్, మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు, సంచార జాతుల ఛైర్మన్ పెంట్ర వీరన్న, డిసిసిబి మాజీ ఛైర్మన్లు కరాటం రాంబాబు, ముత్యాల రత్నం, వైసిపి నేత పెనుమత్స గోపాలకృష్ణంరాజు, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు ధర్మరాజు, భీమవరం ఆర్‌డిఒ దాసిరాజు, రాష్ట్ర రైతు కార్యాచరణ సమితి ప్రధాన కార్యదర్శి పాతపాటి మురళి రామరాజు, కోశాధికారి మంతెన వెంకట రవివర్మ, భీమవరం అల్లూరి సీతారామరాజు సేవా సమితి అధ్యక్షులు గాదిరాజు సుబ్బరాజు, ప్రముఖులు పాల్గొన్నారు.

సమస్యలతో ఆశాలు సతమతం

ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు లక్ష్మి, జ్యోతి

ప్రజాశక్తి - భీమవరం

సమయంతో సంబంధం లేకుండా వివిధ రకాల విధులు నిర్వహిస్తూ ఆశా కార్యకర్తలు సమస్యలతో సతమతమవుతున్నారని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చింతపల్లి లక్ష్మి, డి.జ్యోతి అన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో యూనియన్ జిల్లా కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఆశాల జాబ్‌ఛార్టుకు భిన్నంగా ఆన్‌లైన్ వర్క్ చేయాలని, అటెండెన్స్‌లో సంతకాలు పెట్టాలని, ఒపిలు పెంచాలని, లేనిపక్షంలో జీతాలు ఇవ్వమని వైద్యాధికారులు వేధించడాన్ని సమావేశం ఖండించింది. పనిభారాన్ని తక్షణం తగ్గించాలని, ఆసుపత్రుల్లో సంబంధం లేని పనులు అప్పగించడం మానుకోవాలని కోరింది. ఈ విషయాలపై డిఎంహెచ్‌ఒతో సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలని సమావేశం తీర్మానించింది. ప్రతినెలా జీతాలు, ఇన్సెంటివ్‌లు సక్రమంగా అందించాలని డిమాండ్ చేసింది. యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.రాజారామ్మోహన్‌రాయ్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో ఆశాలకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో జిల్లా నాయకులు బేగం, కుమారి, స్రవంతి, దేవి, ఆదిలక్ష్మి, రమాదేవి, దీపిక, రాజేశ్వరి, వరలక్ష్మి మాట్లాడారు.

అర్జీదారులకు సంతృప్తికర సేవలందించండి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

స్పందనలో అందిన ప్రతి దరఖాస్తునూ నిర్ణీత సమయంలో పరిష్కరించడంతోపాటు అర్జీదారులకు సంతృప్తికరమైన సేవలు అందించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లో జిల్లాస్థాయి స్పందన కార్యక్రమం నిర్వహించారు. సమస్యల పరిష్కారానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుండి 170 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒకే సమస్యపై రెండోసారి స్పందనలో ఫిర్యాదు రాకుండా సమస్య పరిష్కారంలో అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో డిఆర్ఒ కె.కృష్ణవేణి, డిపిఒ ఎం.నాగలత, డిఎల్‌డిఒ కెసిహెచ్.అప్పారావు, భీమవరం డిఎస్‌పి బి.శ్రీనాథ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

వివాహాలన్నీ రిజిస్ట్రేషన్ చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో జరుగుతున్న వివాహాలన్నీ రిజిస్ట్రేషన్ అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మండల స్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం జిల్లా, మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో జరిగే వివాహాలన్నీ విధిగా రిజిస్ట్రేషన్ అయ్యేలా ప్రజలను చైతన్య వంతులు చేయాలన్నారు. ప్రతి వారము ఎన్ని వివాహాలు జరిగాయి, ఎన్ని వివాహాలు రిజిస్ట్రేషన్ అయ్యాయని అధికారులను ఆరా తీశారు. జిల్లాలో బాల్య వివాహాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నట్లు సమాచారం అందితే నిలుపుదల చేసి వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో పిఎంఎవై గృహాలు రిజిస్ట్రేషన్ చేసేలా లేదో పరిశీలించి నివేదిక అందించాలని తెలిపారు. సమావేశంలో డిఆర్ఓ కె.కృష్ణవేణి, డిపిఒ ఎం.నాగలత, డిఎల్డిఒకెసి హెచ్.అప్పారావు, భీమవరం డిఎస్పి బి.శ్రీనాథ్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - అత్తిలి

అమ్మిన ప్రతి బస్తాకూ ఇ- పాస్ నమోదు చేయాలని తాడేపల్లిగూడెం ఎడిఎ పి.మురళీకృష్ణ దుకాణాదారులకు సూచించారు. సోమవారం అత్తిలి, మంచిలి, పాలూరులోని ఎరువుల దుకాణాల్లో మురళీకృష్ణ తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రతి డీలరు విధిగా ఎరువుల రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అమ్మే ప్రతి బస్తాకూ ఇ-పాస్లో నమోదు చేసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎఒ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

1 నుంచి ఉపాధి పనుల సామాజిక తనిఖీ

ప్రజాశక్తి - పెనుమంట్ర

మార్చి 1వ తేదీ నుంచి 2021-22 ఆర్థిక సంవత్సరానికి గాను పది రోజులపాటు గ్రామాల్లో బృందం ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ వి.పూర్ణ బాల్టి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 15వ విడత సామాజిక తనిఖీ బృందం గ్రామాల్లో పంచాయతీరాజ్, సీసీ రోడ్లు, అర్బ్యూస్ అభివృద్ధి పనులు, హౌసింగ్ సంబంధించి వివరాల రికార్డులను పరిశీలిస్తారని తెలిపారు.

గవర్నర్ దత్తాత్రేయకు ముత్యాలరావు ఆహ్వానం

ప్రజాశక్తి - మొగల్తూరు

హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయకు కోమటితిప్ప గ్రామానికి చెందిన పారిశ్రామిక వేత్త సత్తినేని ముత్యాలరావు (ఎస్ఎంఆర్) ఆదివారం ఆహ్వాన పత్రికను అందజేశారు. ముత్యాలరావు ఉంగుటూరు నియోజకవర్గం నారాయణపురంలో ఎక్స్ పాన్ పామీయిల్ కంపెనీని ఏర్పాటు చేశారు. ఆ కంపెనీ ప్రారంభోత్సవానికి దత్తాత్రేయను హైదరాబాదులో కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఆయన సానుకూలంగా స్పందించి ప్రారంభోత్సవానికి వస్తానని హామీ ఇచ్చారని ముత్యాలరావు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పెదతాడేపల్లి 1, 2, రామన్నగూడెం సచివాలయంలో జరుగుతున్న ఫీవర్ సర్వే, వెక్టార్ కంట్రోల్ హైజీన్ కార్యక్రమాన్ని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.ఎల్.కృష్ణారావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు దోమల ద్వారా వచ్చే వ్యాధుల గురించి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దరిచేరవని తెలిపారు. గ్రామంలో ఆశా కార్యకర్త, వాలంటీర్తో కలిసి ఫీవర్ సర్వే చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఆరోగ్య కార్యదర్శులు పద్మ, దానమ్మ, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ ప్రవల్లిక, నాగేశ్వరరావు పాల్గొన్నారు.


హస్త కళల ప్రదర్శన ను సందర్శిస్తున్న ప్రముఖులు

ఎస్కెఎస్డిలో హస్తకళల ప్రదర్శన

ప్రజాశక్తి - తణుకురూరల్

చేతి వృత్తి కళాకారులను ప్రోత్సహిస్తే వారి ద్వారా మరికొంత మంది కళాకారులకు ఉపాధి లభిస్తుందని అసిస్టెంట్ డైరెక్టర్ హెచ్ఎస్సి (విజయవాడ) ఎన్.అపర్ణలక్ష్మి అన్నారు. సోమవారం ఎస్కెఎస్డి మహిళా కళాశాల ఆవరణలో కమీషన్ హేండీక్రాఫ్ట్స్ మినిస్ట్రీ ఆఫ్ టెక్స్టైల్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా న్యూ ఢిల్లీ, హెచ్ఎస్సి విజయవాడ, వశిష్ట గోదావరి లేసు మోడ్-యుపిఎస్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్, రామన్నపాలెం, మొగల్తూరు, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ వారి ఆధ్వర్యంలో జరిగిన హస్తకళ ప్రదర్శన కళశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా హేండ్క్రాఫ్ట్ ప్రమోషన్ ఆఫీసర్ ఎం.సువర్ఛల మాట్లాడుతూ యాంత్రిక జీవనంలో మనిషి సృజనాత్మకతను పోగొట్టుకుంటున్నాడని, కళల ద్వారా మానసిక వికాసాన్ని, ఉపాధి కూడా పొందొచ్చన్నారు. కళాశాల మేనేజ్మెంట్ సభ్యురాలు చిట్టూరి రీనాసాయి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పిడి సుధీర్కుమార్, కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి, పరిపాలనాధికారి డి.సుబ్బారావు, కెవి.శ్యామలాదేవి, వి.తులసీరత్నం పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని పట్టణ జెసిఎ కన్వీనర్లకు ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ సూచించారు. సోమవారం సాయంత్రం స్థానిక క్యాంపు కార్యాలయంలో జెసిఎ కన్వీనర్లతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కన్వీనర్లు వార్డుల వారీగా పార్టీ శ్రేణులతో కలిసి తెలుసుకోవాలన్నారు. ప్రతి కుటుంబమూ ఆర్థికంగా బలోపేతం కావాలనే లక్ష్యంతో నవరత్నాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. భీమవరం పట్టణాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. పట్టణంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ఇప్పటికే అండర్ టన్నెల్స్ను నిర్మించామన్నారు. పట్టణ అభివృద్ధి కోసం నూతనంగా మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశామని తెలిపారు. సమావేశంలో వన్టౌన్ కన్వీనర్ నల్లం రాంబాబు, టూ టౌన్ కన్వీనర్ గాదిరాజు సుబ్రహ్మణ్యం రాజు (తాతరాజు), త్రీ టౌన్ కన్వీనర్ చెల్లబోయిన సూర్యప్రకాశరావు, తోట భోగయ్య పాల్గొన్నారు.

సివి రామన్ను ఆదర్శంగా తీసుకోవాలి

పాలకొల్లు: పట్టణంలోని జివిఎస్విఆర్ఎం మున్సిపల్ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఇఒ ఎఎన్విఇఎన్ ప్రసాద్ మాట్లాడుతూ దేశం గర్వించదగిన గొప్ప భౌతిక శాస్త్రవేత్త సివి రామన్ అన్నారు. తన పరిశోధనకు గాను 1930లో నోబెల్ బహుమతి అందుకున్న మొట్టమొదట భారత భౌతిక శాస్త్రజ్ఞుడు అన్నారు. విద్యార్థులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన ప్రాజెక్టులను చూసి అభినందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ రీజినల్ సెక్రటరీ ఎస్వి.రంగారావు, నిట్టల శైలజ, పెద్దిరాజు, ఎంఎస్ కోఆర్డినేటర్ జనార్ధన్ పాల్గొన్నారు.

దేశ ప్రగతికి సైన్స్ పరిశోధనలు కీలకం

ఎపి నిట్లో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

దేశ ప్రగతికి సైన్స్ పరిశోధనలు ఎంతో కీలకమని, ప్రాథమిక అంశాలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి నూతన ఆవిష్కరణలు చేపట్టాలని ఎపి నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. నిట్ ఇన్ఛార్జి డైరెక్టర్ డాక్టర్ ఎం.ప్రమోద్ పడోలే ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించనున్న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి డీన్ అకడమిక్ డాక్టర్ టి.కురుమయ్య అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి దినేష్ శంకర్ రెడ్డి మాట్లాడుతూ దేశ ప్రతిష్టాత్మక పురస్కారం భారత రత్నతోపాటు భౌతిక శాస్త్రంలో ఎన్నో అపార సేవలందించి భారత్ తరపున మొట్టమొదటి నోబెల్ బహుమతిని అందుకుని సివి రామన్ భారత్ శక్తి సామర్థ్యాలను ప్రపంచానికి చాటి చెప్పారని కొనియాడారు. సివి రామన్ను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకుని నవ చైతన్యానికి నాంది పలకాలని తెలిపారు. తల్లిదండ్రుల ఆశలు, ఆకాంక్షలతోపాటు దేశ భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన బాధ్యత యువతరానిదేనని వివరించారు. గౌరవ అతిథి ఐఐటి భువనేశ్వర్ స్కూల్ ఆఫ్ బేసిక్ బిజినెస్ విభాగం ఆచార్యులు విఆర్ పెద్దిరెడ్డి మాట్లాడుతూ పరిశోధనలు ప్రయోగశాలల నుంచి క్షేత్రస్థాయికి చేరినపుడే వాటికి సార్థకత లభిస్తుందన్నారు. డీన్లు జిఆర్కె.శాస్త్రి, జిబి వీరేష్ కుమార్, ఎన్.జయరామ్ మాట్లాడారు. అనంతరం విద్యార్థులు పరిశోధనలను ప్రజంటేషన్ ద్వారా వివరించారు.



మాట్లాడుతున్న నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ దినేష్ శంకర్రెడ్డి

స్పందన సమస్యలు త్వరగా పరిష్కరించాలి

సబ్ కలెక్టర్ సూర్యతేజ

ప్రజాశక్తి - నరసాపురం

స్పందనలో వచ్చిన ఫిర్యాదులను ఛాలెంజ్గా తీసుకుని త్వరితగతిన అధికారులు పరిష్కరించి, ఫిర్యాదుదారులకు భరోసా కల్పించాలని సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ అన్నారు. సోమవారం నరసాపురం సబ్ కలెక్టరు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ప్రజల నుంచి వచ్చిన 53 ఫిర్యాదులను సబ్ కలెక్టర్ సూర్యతేజ స్వీకరించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టరు మాట్లాడుతూ అర్జీలు గడువులోగా పరిష్కరించే విధంగా మండల స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. స్పందనలో అందిన అర్జీలను రీఓపెన్ కాకుండా స్పష్టతతో పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో భూ సమస్యలు, రేషన్ కార్డులు, పింఛన్లు, హౌసింగ్, మత్స్యశాఖ, వైద్య ఆరోగ్యశాఖ తదితర సమస్యపై ఫిర్యాదులు అందాయని తెలిపరు. కార్యక్రమంలో డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.


ఫిర్యాదులు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ సూర్యతేజ

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం డైమండ్స్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ సర్వీస్ ఛైర్పర్సన్, లయన్ వేగేశ్న రామరాజు సౌజన్యంతో పడాల జీవన సంధ్య వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం సోమవారం చేశారు. వేగేశ్న లక్ష్మి నరసమ్మ దినం సందర్భంగా వృద్ధులకు పండ్లు, భోజనం అందజేశారు. వశిష్ఠ లియో క్లబ్ అధ్యక్షురాలు లియో మాధురి ఆధ్వర్యంలో లియో సభ్యులు వృద్ధులను పరామర్శించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వేగేశ్న లలిత లియో క్లబ్ సభ్యులు కార్తీక్ లియో, బాల శివ లియో, ప్రజ్ఞ అంబికా పాల్గొన్నారు.

వెంకటాపురంలో 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి'

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని వెంకటాపురం గ్రామంలో ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. డ్రెయినేజీ, తాగునీటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారని తెలిపారు. అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయినేజీల వల్ల దోమలు పెరిగి విషజ్వరాల బారిన పడి గ్రామస్తులు ఆసుపత్రుల పాలౌతున్నారని తెలిపారు. డ్రెయినేజీలు శుభ్రం చేయించి ప్రజల ఆరోగ్యం కాపాడాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో పాముల రజినీకుమార్, నెక్కంటి ఆదినారాయణ, కోటి వీరభద్రం, దాసరి సత్యం పాల్గొన్నారు.

ఉపాధి హామీకి నిధులు పెంచాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

బడ్జెట్లో ఉపాధి హామీకి నిధులు పెంచాలని, రెండో పూట మస్తర్ విధానం రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కండెల్లి సోమరాజు డిమాండ్ చేశారు. నీలాద్రిపురం గ్రామ పంచాయతీ పరిధి కృష్ణాపురంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కండెల్లి సోమరాజు ఉపాధి పనులను పరిశీలించి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రెండో పూటా మస్తర్తో కూలీలు నానా పాట్లు పడుతున్నారని తెలిపారు. ఈ సంవత్సరం బడ్జెట్లో ఉపాధి హామీకి రూ.60 వేల కోట్లు కేటాయించడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బడ్జెట్లో సవరణ చేసి కూలీలపై చిత్తశుద్ధి ఉంటే నిధులు పెంచాలని, రెండో పూటా మస్తర్ విధానం రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం తలారి సుబ్బారావు, మల్లిపూడి వెంకటేశులు, రేకపల్లి నాగమణి, కండెల్లి లక్ష్మి, పోలిశెట్టి సుజాతతో కమిటీ ఏర్పాటు చేశారు.

ఉగాది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

శ్రీ విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో 32 ఏళ్లగా భీమవరం పట్టణంలో నిర్వహిస్తున్న ఉగాది వేడుకల్లో వివిధ రంగాల్లో సేవా తత్పరులకు ఉగాది పురస్కారాలు అందిస్తున్నామని కన్వీనర్ చెరుకువాడ రంగసాయి తెలిపారు. సోమవారం స్థానిక కిరాణా మర్చంట్ అసోసియేషన్ భవనంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది ఉగాది పురస్కారాలకు దరఖాస్తులకు ఆహ్వానం పలుకుతున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఈ అవార్డు అందిస్తున్నామని, ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో విద్య, వైజ్ఞానిక, కళా, సామాజిక క్రీడ, కార్మిక వ్యవసాయ రంగాల వారికి అవార్డులు అందిస్తున్నామని తెలిపారు. చెరుకువాడ వెంకట్రామయ్య, లైబ్రేరియన్ కె.శిరీష మాట్లాడుతూ మహిళలు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తుదారులు నరసయ్య అగ్రహారం, గడియారం వారి వీధి, 08816 236063ను సంప్రదించాలని కోరారు. మార్చి 9వ తేదీలోగా దరఖాస్తులు పంపాలని కోరారు.

పారిశుధ్య సమస్య పరిష్కరించాలని ఆందోళన

ప్రజాశక్తి - ఉండి

పారిశుధ్య సమస్యను పరిష్కరించండి మహాప్రభో అంటూ కోంద్రోతుపేటకు చెందిన మహిళలు తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ తమ వీధిలో డ్రెయినేజీల్లో మురుగునీరు పేరుకుపోయి రోడ్లపైకి వచ్చేస్తోందని, దీంతో దుర్వాసన వెదజల్లి రోడ్డుపైకి రావాలంటే ఇబ్బందిగా ఉందని తెలిపారు. మురుగునీరు నిల్వ ఉండడం వల్ల దోమలు పెరిగిపోయి అనారోగ్యాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వేసవి కాలంలోనే మురుగునీరు రోడ్లపైకి వచ్చేస్తుంటే వర్షాకాలంలో ఏ విధంగా ఉండాలని అధికారులను ప్రశ్నించారు. తక్షణం అధికారులు స్పందించి పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని కోరారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ వర్మకు వినతిపత్రం అందజేశారు. సమస్యను పరిష్కరించే వరకూ దశల వారీగా పోరాటం చేస్తామని సిపిఎం నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోంద్రోతుపేటకు చెందిన మహిళలు బి.సాయికుమారి, కె.పరాళ్లు, జె.లక్ష్మి, బి.శ్యామల, కె.గ్రేసి, జె.సూరమ్మ, కె.సింహాచలం, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్వి గోపాలన్, మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్, చీర్ల శేషు, చీర్ల శ్రీనివాస్, ఎం.గోపి, చిప్పాడ బుచ్చేశ్వరరావు, కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్కు వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

సంక్షేమ పాలనే జగన్ లక్ష్యం : ఎంఎల్ఎ చెరుకువాడ

ప్రజాశక్తి - ఆచంట

రాష్ట్ర ప్రభుత్వం పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తోందని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు తెలిపారు. సోమవారం ఆచంటలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి గ్రామంలో జరిగిన సంక్షేమ అభివృద్ధిని వివరించి, ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. దళిత, బడుగు బలహీన వర్గాల అగ్రవర్ణ నిరుపేదలకు ఆర్థికంగా నిలబెట్టేందుకు ముఖ్యమంత్రి అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నారని కొనియాడారు. ప్రతి యాభై ఇళ్లకు ఒక వాలంటీర్ను నియమించి వారి ద్వారా అందరికీ సంక్షేమ పాలన అందేలా వ్యవస్థను ఏర్పాటు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆచంట మార్కెట్ యార్డు ఛైర్మన్ చిల్లే లావణ్య, సర్పంచి కోట సరోజినీ వెంకటేశ్వరరావు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్, గ్రామ కమిటీ అధ్యక్షులు సత్యనారాయణ, సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్, మండల కన్వీనర్ జక్కంశెట్టి చంటి పాల్గొన్నారు.


సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు


పంచాయతీ అధికారి మహంతికి వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతి

ప్రజాశక్తి - పెనుగొండ

పెనుగొండ పంచాయతీ పరిధి కోడిపందేల దిబ్బలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ కాలనీవాసులు సిపిఎం ఆధ్వర్యంలో పంచాయతీ అధికారి ఎం.మహంతికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీకి చెందిన పలువురు మహిళలు మాట్లాడారు. కాలనీలో కరెంటు లేదని, రాత్రి సమయంలో విష సర్పాలు సంచరించడంతో బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. కాలనీ ఏర్పడి 14 సంవత్సరాలైనా ఇంతవరకూ మౌలిక సదుపాయాలు అరకొరగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కోడి పందేల దిబ్బలో విద్యుత్, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మాదాసు.నాగేశ్వరరావు, గెద్దాడ శ్రీను, మహిళలు పాల్గొన్నారు.

ఉద్యోగుల భవిష్య నిధి ఖాతాదారులకు అవగాహన

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సంస్థ సహాయ కమిషనర్ వైడి శ్రీనివాస్ కోరారు. సోమవారం స్థానిక విష్ణు కాలేజీ మినీ ఆడిటోరియంలో సంస్థ సహాయ కమిషనర్ వైడి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉద్యోగుల భవిష్య నిధి ఖాతాదారులతో ఒకరోజు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇపిఎఫ్ ఖాతాదారులు లావాదేవీలపై ఎదుర్కొంటున్న ఇబ్బందులను సులువుగా పరిష్కరించుకునేందుకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీనిలో భాగంగా ఇపిఎఫ్ సంస్థ చేస్తున్న సేవలపై ఖాతాదారులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. మేనేజర్ కె.శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ఖజానా అధికారి అడారి గణేష్, ఇపిఎఫ్ సంస్థ నోడల్ అధికారి పి.శివరామకృష్ణ, తహశీల్దార్ వై.రవికుమార్ పాల్గొన్నారు.


సంస్థ కమిషనర్ వైడి శ్రీనివాస్

ఉంగరం కోసమే స్నేహితుడి హత్య..

ప్రజాశక్తి - పాలకొల్లు

బంగారు ఉంగరం కోసం మూగవాడైన స్నేహితుడిని హతమార్చిన కేసులో నిందితుడు వీరబాబును అరెస్టు చేశామని జిల్లా ఎస్పి రవిప్రకాష్ తెలిపారు. సోమవారం పట్టణ పోలీస్స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పి వివరాలు వెల్లడించారు. పాలకొల్లులోని ఎవిఎస్ కాలనీకి చెందిన మూగవాడైన నిడమర్తి సాంబశివరావు (42), ఉల్లంపర్రుకు చెందిన పిండి వీరాబాబు స్నేహితులు. ఈ నెల 11న సాంబశివరావు దేశాలమ్మ గుడి నుంచి వెళ్తుండగా వీరబాబు అతనిని తన మోటార్ సైకిల్పై ఎక్కించుకుని తీసుకెళ్లాడు. అయితే తరువాత సాంబశివరావు గల్లంతయ్యాడు. ఈనెల 24న నరసాపురం మండలం సీతారామపురం కాలువలో అతని మృతదేహం లభ్యమైంది. సీసీ కెమెరాల ఆధారంగా శివను వీరబాబు తీసుకెళ్లినట్లు పోలీసులు గుర్తించి విచారించారు. బంగారు ఉంగరం కోసమే స్నేహితుడిని హత్య చేసినట్లు నిందితుడు ఒప్పుకున్నాడని ఎస్పి చెప్పారు. మృతునికి పెళ్లి కాలేదు. మృతుని సోదరుడు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నరసాపురం డిఎస్పి మనోహరాచారి, పట్టణ సిఐ శ్రీనివాస్ యాదవ్, పట్టణ ఎస్ఐ.ముత్యాలరావు పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పి రవిప్రకాష్

మూడు అండర్ టన్నెల్స్ మంజూరుకు వినతి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మాజీ శాసనసభ్యులు పాతపాటి సర్రాజు సంతాప సభకు హాజరయ్యేందుకు సోమవారం భీమవరం వచ్చిన రాజంపేట ఎంపీ పి.మిథున్ రెడ్డి ఎంఎల్ఎ గంధి శ్రీనివాస్ ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ఆయనకు ఘన స్వాగతం పలికారు. ప్రస్తుతం నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి ఎంఎల్ఎ గ్రంథి ఎంపీకి వివరించారు. అంతేకాకుండా పట్టణంలో ట్రాఫిక్ సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించే విధంగా నరసింహపురం రైల్వే గేట్ వద్ద, బైపాస్ రోడ్ రైల్వే గేట్ వద్ద, ఉండి రైల్వే గేట్ వద్ద అండర్ టన్నెల్స్ ను నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీ మిథున్ రెడ్డికి, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్కు వినతిపత్రం అందించారు. పట్టణంలో మూడు అండర్ టన్నెల్స్ నిర్మించినట్లయితే ట్రాఫిక్ సమస్యలు ఉండవన్నారు. ఎంపీ మిథున్ రెడ్డి వెంట ఏలూరు పార్లమెంట్ సభ్యులు కోటగిరి శ్రీధర్, జక్కంపూడి గణేష్ ఉన్నారు.

మిగులు భూములు పేదలకు పంచాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

కాళీపట్నంలో ఉన్న మిగులు భూములు పేదలకు పంచాలని రైతు సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం కాళీపట్నంలో నేతలు రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడారు. సర్వేనెంబర్ 372లో ఉన్న మెట్ట భూములను జిల్లా అధికారులతో సర్వే చేయించి పేదలకు పంచాలన్నారు. దీనిపై కృష్ణ, పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్లకు, సబ్కలెక్టర్, మండల రెవెన్యూ అధికారులకు వినతి పత్రాలు అందించామని తెలిపారు. ఈ సమావేశం సన్న చిన్న కారు రైతుల ఉద్యమ సంఘం అధ్యక్షులు తణుకుల నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. సంఘం కార్యదర్శి నరసింహులు, కోశాధికారి తణుకుల వెంకన్న, సత్తినేని పెద్దిరాజు, కవురు పెద్దిరాజు, రంగిశెట్టి శ్రీరాములు, బాలం శ్రీను పాల్గొన్నారు.

రామలింగేశ్వర స్వామికి వెండి బిందె, ధారాపాత్ర బహూకరణ

ప్రజాశక్తి - పాలకొల్లు

క్షీరా రామలింగేశ్వర స్వామికి పాలకొల్లుకు చెందిన బోళ్ల తిరుపన్న కుమారుడి కుమార్తెలు వెండి బిందె, వెండి ధారా పాత్ర బహూకరించారు. సోమవారం వారు ఆలయ ఛైర్మన్ కోరాడ శ్రీనివాస్, ఇఒ యాళ్ల సూర్యనారాయణ, ట్రస్టీలకు అందజేశారు. సుమారు 1.25 కేజీల బరువు గల 2 వస్తువులను స్వామి వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బోళ్ల మురళీమోహన్ పాల్గొన్నారు.

నేడు పిల్లల ఉచిత గుండె వైద్య శిబిరం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పిల్లల హృదయ సంబంధిత వ్యాధులకు సంబంధించి ఉచిత వైద్య శిబిరాన్ని ఈ నెల 28వ తేదీ మంగళవారం సాయంత్రం మెంటేవారి తోటలోని సుందరయ్య భవనంలో నిర్వహిస్తున్నట్లు అల్లూరి సీతారామరాజు భగత్సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం కన్వీనర్ వి.రాధాకృష్ణ, వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడకు చెందిన ప్రత్యేక వైద్య నిపుణులు డాక్టర్ కె.విక్రమ్ పిల్లలను పరీక్షిస్తారని తెలిపారు. వైద్య శిబిరానికి వచ్చేవారు తమ పేరు నమోదు కోసం 6281225145 నంబరును సంప్రదించాలని తెలిపారు.